
తెలుగు దినపత్రిక
# డైలీ రిపోర్ట్
DAILY REPORT

సంపుటి: 1 సంచిక: 62 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: తెలంగాణ శుక్రవారం 4-10-2024 వెల: 5/రూ -




# ఫామ్‌హౌస్‌ల కోసమే మూసీ ముసుగు!

**మూసీ బాధితుల కోసం ఓ 500 కోట్లు ఇవ్వండి**
**1500 కోట్ల పార్టీ సొమ్ములో తీసి ఇవ్వవచ్చు కదా**
**మూసీ అభివృద్ధికి ప్రత్యామ్నాయం చూపితే సిద్ధమే**
**తప్పులు...అప్పులను సరిదిద్దుతూ పోతున్నాం**
**పదేళ్లపాటు కంటోన్మెంట్‌ను ఎందుకు పట్టించుకోలే**
**బిఆర్ఎస్ తీరుపై నిప్పులు చెరిగిన సిఎం రేవంత్**

హైదరాబాద్: చెరువుల్లో అక్రమంగా నిర్మించిన ఫాంహౌస్‌లపై వేటుపడకుండా ఉండేందుకే బీఆర్ఎస్ నేతలు ముసుగు తొడుక్కొని మూసీ నిర్వాసితులను రక్షణ కవచంగా వినియోగించుకుంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బురదలో కూరుకుపోతున్న నగరాన్ని కాపాడేందుకు తాము మూసీపై ముందుకెళ్తుంటే దానిపైనా బురదజల్లుతున్నారని పరోక్షంగా కేటీఆర్, హరీశ్‌రావులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. పేదలకు అన్యాయం జరుగుతోందని డ్రామాలాడుతున్న బీఆర్ఎస్ నేతలు చేతనైతే ఆ పార్టీ ఖాతాలోని రూ. 1,500 కోట్ల తెలంగాణ ప్రజల సొమ్ములో రూ. 500 కోట్లను మూసీ బాధితులకు పంచాలని సూచించారు. మురికి మూసీలో జీవచ్ఛవాల్లా ఉన్న పేదలు ఆత్మగౌరవంతో బతకడానికి ఇళ్లు ఇస్తుంటే రెచ్చగొట్టడం తగదన్నారు.

2లో

# పడిపోతున్న ప్రభుత్వ ఆదాయం సీఎం పాలనా వైఫల్యానికి నిదర్శనం

**ఇంకా శుద్ధి ఎందుకు, లక్షన్నర కోట్ల ఖర్చు ఎందుకు?:కేటీఆర్**
**నమామి గంగేకు కిలోమీటరుకు రూ.17 కోట్లు, మూసీకి 2,700 కోట్లా?**
**రేవంత్ ధన దాహం, కుంభకోణాలకు సామాన్యులు బలి అవుతున్నారు**




హైదరాబాద్: 'మూసీ మురికి అంతా వాళ్ల నోట్లోనే.. ఇంకా శుద్ధి ఎందుకు, లక్షన్నర కోట్ల రూపాయల ఖర్చు ఎందుకు'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ నేతలను ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్, మంత్రులు తనపై చేస్తున్న వ్యాఖ్యలపై మండిపడ్డారు. తన వ్యక్తిత్వాన్ని హననం చేసేలా వ్యాఖ్యలు చేసిన ఓ మంత్రికి లీగల్ నోటీసులు పంపించానని, కాంగ్రెస్ పార్టీ రాజకీయ వికారాలకు పాల్పడుతోందని అన్నారు. సీఎంతో పాటు తనపై వ్యాఖ్యలు చేసిన మంత్రిని మానసిక ఆరోగ్య నిపుణుల వద్దకు లేదా మానసిక వైద్యుల వద్దకు పంపాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ఆయన కోరారు.

2లో

# ఇంకా సద్దుమణగలేదు!

**అక్కినేని కుటుంబంపై మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యల్ని తీవ్రంగా తప్పుబట్టిన సినీ పరిశ్రమ**
**నాగార్జున ఫ్యామిలీ, సమంతకు చిరంజీవి, వెంకటేష్, మహేష్‌బాబు, ప్రభాస్, విజయ్ దేవరకొండ తదితరుల బాసట**
**సున్నిత అంశాలపై ఎవరు మాట్లాడినా తగిన చర్యలు తీసుకుంటామన్న 'మా'**
**సురేఖపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ నాంపల్లి కోర్టులో నాగార్జున పరువునష్టం దావా**



# కొత్త పాలసీలతో అన్ని రంగాలనూ గాడినపెట్టాలి: సీఎం

**మళ్లీ ఆర్థిక వృద్ధి సాధించాలి.. ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలి**
**వారిపై అదనపు భారం లేకుండా ఆదాయం పెంచడంపై దృష్టి**
**జగన్ రివర్స్ నిర్ణయాలతో అది 10.59 శాతానికి తగ్గింది**
**తలసరి ఆదాయమూ ఢమాల్.. వెనుకబడిన శాఖలు క్రియాశీలం కావాలి**
**జనవరిలో పీ-4 విధానం: చంద్రబాబు నిర్దేశం**

# బీరుట్‌పై భీకర దాడి

**హెజ్‌బొల్లా పౌరవిభాగం సభ్యులు సహా తొమ్మిది మంది మృతి**
**దక్షిణ లెబనాన్ వద్ద కొనసాగుతున్న పరస్పర దాడులు**

2లో

# బాబు మోసాలపై ప్రజాగ్రహం

**పార్టీ నేతలు, జెడ్పీటీసీలతో సమావేశంలో వైఎస్ జగన్**

**తమకు ఎవరి వల్ల మంచి జరిగిందో ప్రతి కుటుంబంలోనూ చర్చ మొదలైంది**
**కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలైనా వార్షిక బడ్జెట్ లేదు**
**పథకాలకు కేటాయింపులపై నిలదీస్తారనే భయంతోనే..**
**ఓట్ ఆన్ అకౌంట్‌తో చంద్రబాబు కాలయాపన**
**మళ్లీ వచ్చేది కచ్చితంగా మన ప్రభుత్వమే**



అమరావతి: అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నా సీఎం చంద్రబాబు కనీసం వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టలేకపోతున్నారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. దేశం, రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ చూడని విధంగా, ఎన్నడూ జరగని విధంగా ఈ ప్రభుత్వం ఇంతవరకు రెగ్యులర్ బడ్జెట్ పెట్టలేదని, ఇంకా ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పైనే కాలం గడుపుతోందని విమర్శించారు. రెగ్యులర్ బడ్జెట్ ప్రవేశపెడితే ఏయే స్కీమ్‌కు ఎంత కేటాయించారన్నది చెప్పాల్సి ఉంటుందని.. అలా చెప్పకుంటే ప్రజలు తిడతారనే భయంతో బడ్జెట్ ప్రవేశపెట్టకుండా చంద్రబాబు కాలయాపన చేస్తున్నారని దుయ్యబట్టారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల పార్టీ నాయకులు, జెడ్పీటీసీలతో

2లో




# వైవాహిక అత్యాచారం నేరం కాదు

**భార్య అనుమతి లేకుండా జరిపే శృంగారాన్ని క్రిమినల్ చర్యగా పరిగణించలేం**
**నేరంగా గుర్తిస్తే వివాహ వ్యవస్థపై తీవ్ర ప్రభావం**
**వైవాహిక అత్యాచారంపై ఇతర చట్టాల ప్రకారం కేసులు పెట్టొచ్చు.. సుప్రీంకోర్టులో కేంద్రం**

2లో

# వైసీపీకి 11 సీట్లే ఇచ్చినా బుద్ధి రాలేదు

**దైవానికి అపచారం జరిగితే ఊరుకుంటామా?**
**నాటి సీఎంగా జగన్ బాధ్యత వహించాల్సిందే**
**వేల కోట్లు తిన్న వ్యక్తి ఏమీ తెలియనట్టు కోర్టుకు**
**ఆయనపై కేసులనూ సుప్రీం పరిగణించాలి**
**తిరుపతి సభలో ఉప ముఖ్యమంత్రి పవన్ నిప్పులు**
**రాహుల్, ఉదయనిధిపై పరోక్ష విమర్శలు**





తిరుపతి: సనాతన ధర్మాన్ని దెబ్బతీయాలని చూసేవారు ఎవరైనా సరే తుడిచిపెట్టుకుపోతారని ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ హెచ్చరించారు. దీనిపై బలమైన చట్టం రావాల్సి ఉందన్నారు. గురువారం రాత్రి తిరుపతిలోని జ్యోతిరావు పూలే కూడలిలో జరిగిన వారాహి డిక్లరేషన్ సభలో ఆయన ప్రసంగించారు. అత్యధిక అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలు గెలిచి కేంద్ర ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలిచిన తమ కూటమి ప్రభుత్వానికి రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదని, ఇప్పుడేమీ ఎన్నికలు కూడా లేవని తెలిపారు. "అధికారంలోకి వచ్చి కేవలం వంద రోజులే అయింది. ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమాలపై ఇచ్చిన హామీలను ఎలా నిలబెట్టుకోవాలా అన్నదాని గురించే ఇపుడు మేం ఆలోచిస్తున్నాం.

2లో

## పడిపోతున్న ప్రభుత్వ ఆదాయం

### సీఎం పాలనా వైఫల్యానికి నిదర్శనం

రాష్ట్రంలోని అనేక అంశాలకు సంబంధించి కేటీఆర్ గురువారం సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో వరుస పోస్టులు చేశారు. గంగానది ప్రక్షాళన కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'నమామి గంగే' ప్రాజెక్టుకు కిలోమీటరుకు రూ.17 కోట్ల చొప్పున ఖర్చవుతుండగా, మూసీ సుందరీకరుణకు మాత్రం కి.మీ.కు రూ.2,700 కోట్లు ప్రతిపాదించారన్నారు. ఇది సుందరీకరణ ప్రాజెక్టు కాదని, ప్రజాధనాన్ని లూటీ చేసే పథకమని విమర్శించారు.కష్టపడి పైసా పైసా కూడబెట్టుకుని, బ్యాంకు నుంచి అప్పు తెచ్చి మరీ కట్టుకున్న గూడును ప్రభుత్వం ఎప్పుడు కూల్చుతుందో అన్న భయంతో సామాన్యులు ప్రాణాలు వదులుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. గుండెలు ఆగిపోతున్నా, కుటుంబాలు చెల్లా చెదురవుతున్నా ప్రభుత్వం మాత్రం ఇళ్ల కూల్చివేతలపై తగ్గడం లేదన్నారు. ఉమ్మడి కుటుంబాలను రోడ్డుకు ఈడ్చి చిచ్చు పెట్టిన మూరు?డు సీఎం రేవంత్‌రెడ్డి అని మండిపడ్డారు. మూసీ వద్ద ఇళ్లు ఖాళీ చేస్తే డబుల్ బెడ్ రూమ్ ఇల్లుతో పాటు రూ.25 వేల పారితోషికం.. అంటూ అధికారులు వెకిలి ఆఫర్లు ఇస్తున్నారని మండిపడ్డారు. కోటి ఆశలతో కట్టుకున్న కలల సౌధం ఖరీదు కేవలం రూ.25 వేలేనా అని ప్రశ్నించారు. మీ సోదరుడు, మంత్రుల ఇళ్లకు రూ.50 వేలు ఇస్తే కూల్చుమంటారా? అని వ్యాఖ్యానించారు. ఇండ్లు పోతాయనే భయంతో బుచ్చమ్మ, కుమార్ ప్రాణాలు పోయాయని, సీఎం ధన దాహం, కుంభకోణాలకు ఎంత మంది ప్రాణాలు పోవాలో చెప్పాలన్నారు. ఇల్లు కూలుస్తారనే భయంతో కుమార్ అనే వ్యక్తి మరణించడంతో ఇప్పటికే తల్లి కూడా లేని ముగ్గురు పిల్లలు అనాథలు అయ్యారన్నారు. వీటన్నిటికీ ప్రజలు కాంగ్రెస్‌కు మిత్తితో సహా గుణపాఠం చెప్తారన్నారు.

## ఇంకా సద్దుమణగలేదు!



(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: సినీ హీరో అక్కినేని నాగార్జున కుటుంబంతోపాటు సినీనటి సమంతపై తెలంగాణ అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వివాదం ఇంకా సద్దుమణగలేదు. మంత్రి వ్యాఖ్యలను తప్పుపడుతూ చలనచిత్ర ప్రముఖులు గురువారం తీవ్రస్థాయిలో స్పందించారు. అక్కినేని కుటుంబంతోపాటు నటి సమంతకు బాసటగా నిలిచారు. ఈ మేరకు కొండా సురేఖపై సోషల్ మీడియా వేదికగా ధ్వజమెత్తారు. తెలుగు సినీ పరిశ్రమతోపాటు ఇతర భాష నటీనటులు కూడా స్పందించారు. మెగాస్టార్ చిరంజీవి, హీరోలు వెంకటేష్, మహేష్‌బాబు, ప్రభాస్, రాంచరణ్, జూనియర్ ఎన్టీఆర్, అల్లు అర్జున్, రవితేజ, నరేష్, నాని, విజయ్ దేవరకొండతో పాటు సీనియర్ నటి విజయశాంతి, హీరోయిన్ రకుల్‌ప్రీత్ సింగ్, దర్శకులు రాజమౌళి, హరీశ్ శంకర్, తమిళ నటి కుష్బూ తదితరులు కూడా మంత్రి సురేఖ వ్యాఖ్యలను తప్పుపడుతూ 'ఎక్స్', ఇన్‌స్టాగామ్‌ులలో పోస్టులు పెట్టారు. సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ సైతం మంత్రి వ్యాఖ్యలను తప్పుబట్టారు. సినీ పరిశ్రమకు చెందిన సభ్యుల వ్యక్తిగత జీవితాలతో ముడిపడి ఉన్న సున్నిత అంశాలపై ఎవరు మాట్లాడినా తగిన చర్యలకు ఉపక్రమిస్తామని తెలుగు ఫిలిం చాంబర్ ఆఫ్ కామర్స్ స్పష్టం చేసింది. తెలుగు మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) అధ్యక్షుడు మంచు విష్ణు.. అసోసియేషన్ తరపున కొండా సురేఖ వ్యాఖ్యలను తప్పుపడుతూ అధికారికంగా సుదీర్ఘ లేఖ విడుదల చేశారు. మంత్రి కొండా సురేఖ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో మరింత నష్టం జరగకుండా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ నష్ట నివారణ చర్యలు చేపట్టారు. దీంతో సురేఖ తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుంటున్నట్లు 'ఎక్స్' లో పోస్టు చేశారు.

## కొత్త పాలసీలతో అన్ని రంగాలనూ గాడినపెట్టాలి: సీఎం

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి వివిధ ప్రభుత్వ శాఖల్లో నూతన పాలసీలతో అన్ని రంగాలనూ గాడిన పెట్టి మళ్లీ ఆర్థిక వృద్ధి సాధించాలని సీఎం చంద్రబాబు అన్నారు. 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, పారిశ్రామిక, సేవల రంగాల్లో వృద్ధిపై గురువారమిక్కడి సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వ విధ్వంసకర విధానాలతో అన్ని రంగాలూ తిరోగమనంలోకి వెళ్లాయని.. దీంతో ఆర్థిక వ్యవస్థ కుదేలైందని తెలిపారు. ఇప్పుడు ప్రతి శాఖలో కొత్త పాలసీలు తీసుకొస్తున్నామని.. వీటిని సమర్థంగా అమలు చేసి ఆర్థిక పురోగతి సాధించాలని స్పష్టం చేశారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంతో పాటు వారిపై అదనపు భారం లేకుండా ప్రభుత్వ ఆదాయం పెంచే విధానాలను అమలు చేయాలని పేర్కొన్నారు. 'వ్యవసాయం రంగంలో సమగ్ర యాంత్రీకరణ ద్వారా సాగు ఖర్చులు తగ్గించవచ్చు. ప్రభుత్వం అంటే పథకాలు ఇవ్వడం మాత్రమే కాదు. ఆయా రంగాలను బలోపేతం చేసి ప్రజల ఆదాయాలను పెంచడం ముఖ్యం. 2014 తర్వాత రాష్ట్ర విభజన కష్టాలు ఉన్నా.. నాడు తీసుకున్న నిర్ణయాలతో రాష్ట్రం 13.7 శాతం వృద్ధి రేటు సాధించింది.

## బాబు మోసాలపై ప్రజాగ్రహం

వైఎస్ జగన్ సమావేశమయ్యారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో జెడ్పీ చైర్‌పర్సన్ పార్టీ మారినా, జెడ్పీటీసీలు కలసికట్టుగా నిలబడ్డారని ప్రశంసించారు. జెడ్పీటీసీల పోరాట స్ఫూర్తికి అభినందనలు తెలిపారు. 'రాజకీయాల్లో మీరు విలువలు, విశ్వసనీయత చూపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 48 జెడ్పీటీసీల్లో మన పార్టీ తరఫున 46 మంది గెలిచాం. అందులో ఒకరు ఎమ్మెల్సీ కావడంతో 45 మంది మిగిలారు. కలసికట్టుగా నిలిచిన జెడ్పీటీసీలందరికీ ధన్యవాదాలు. మీ వ్యక్తిత్వం చాలా మందికి ఆదర్శంగా నిలిచింది..' అని అభినందించారు. సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే...మన ఐదేళ్ల పాలనలో ప్రజలకు చెప్పిన ప్రతి మాట నెరవేర్చాం. రాజకీయాల్లో మేనిఫెస్టో అన్నదానికి ఒక నిర్వచనం ఇచ్చాం. మేనిఫెస్టోను ఒక భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించి తు.చ. తప్పకుండా తొలి రోజు నుంచే అమలు చేశాం.

# బీరుట్‌పై భీకర దాడి

(మొదటి పేజీ తరువాయి)

బీరుట్/జెరూసలేం: హెజ్‌బొల్లా చీఫ్‌ను అంతం చేసి దాడులను ఉధృతంచేసిన ఇజ్రాయెల్ ఇప్పుడు ఏకంగా లెబనాన్ దేశ రాజధాని నడిబొడ్డున దాడికి తెగబడింది. బీరుట్ నగరంలో దేశ పార్లమెంట్, ప్రధాన మంత్రి కార్యాలయం, ఐక్యరాజ్యసమితి లెబనాన్ ప్రధాన కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఉన్న ప్రాంతంపై దాడి చేసింది. గురువారం తెల్లవారుజామున సెంట్రల్ బీరుట్‌లోని బషొరా జిల్లాలోని ఒక అపార్ట్‌మెంట్‌పై జరిగిన దాడిలో 9 మంది మృతిచెందారు. దీంతో భవంతిలోని హెజ్‌బొల్లా హెల్త్‌సెంటర్ దెబ్బతింది. చనిపోయిన వారిలో హెజ్‌బొల్లా ఆరోగ్యకేంద్రంలో పనిచేసే ఏడుగురు సభ్యులున్నట్లు లెబనాన్ ఆరోగ్య శాఖ ధృవీకరించింది. మవాద్ ప్రాంతంలోని హెజ్‌బొల్లా మీడియా సంబంధాల భవనం మీదా దాడులు జరిగాయి. బింట్ జిబేయిల్ పట్టణంలోని ఆర్మీ పోస్ట్‌పై జరిగిన శతఘ్ని దాడిలో ఒక లెబనాన్ సైనికుడు చనిపోయారు. దక్షిణ లెబనాన్‌లో గాయపడిన పౌరులను తరలిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది వాహనంపై దాడి జరిగింది. తయ్యిబే గ్రామ సమీపంలో జరిగిన ఈ దాడిలో నలుగురు పారామెడికల్ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. " ఐరాస శాంతిపరిరక్షక దళాల సమన్వయంతో ముందస్తు సమాచారంతోనే వైద్యసిబ్బంది వెళు న్నారు. అయినాసరే వారిపై దాడి జరిగింది. ఇది ముమ్మాటికీ అంతర్జాతీయ చట్టాలు, ఒడంబడికలను ఉల్లంఘించడమే. వాళ్ల వద్ద ఆయుధాలు ఉన్నాయని ఎలా ఓ నిర్ణయానికొస్తారు? సొంత నిర్ణయాలు తీసుకుని దాడులు చేసే అధికారం ఇజ్రాయెల్‌కు ఎవరిచ్చారు?" అని లెబనాన్ ఆరోగ్య మంత్రి ఫిరాస్ అబియద్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మరోవైపు దక్షిణ లెబనాన్ భూభాగాన్ని ఇజ్రాయెల్ ఆక్రమించడం మొదలెట్టింది. ఆక్రమణను ప్రతిఘటిస్తూ లెబనాన్ సైన్యం జరిపిన దాడిలో ఇజ్రాయెల్‌కు చెందిన ఎనిమిది మంది సైనికులు చనిపోయారు.



### తరలిపోతున్న విదేశీయులు

సంక్షోభం నేపథ్యంలో తమ పౌరులను స్వదేశానికి తరలించేందుకు స్పెయిన్ రంగంలోకి దిగింది. బీరుట్ ఎయిర్‌పోర్ట్‌కు రెండు విమానాలను హుటాహుటిన పంపించింది. ఐరాస శాంతి కార్యక్రమాల్లో భాగంగా బీరుట్‌లో ఉన్న 676 మంది తమ సైనికులు తదుపరి ఆదేశాలు వచ్చేదాకా అక్కడే ఉంటారని స్పెయిన్ పేర్కొంది. ట్రిపోలీ నౌకాశ్రయం నుంచి 300కుపైగా తుర్కియే దేశస్తులు స్వదేశం పయనమయ్యారు. బ్రిటన్, ఆస్ట్రేలియా, జపాన్, ఇటలీ దేశస్తులు సైతం లెబనాన్ వీడుతున్నారు. గత 24 గంటల్లో 28 మంది హెల్త్‌వర్కర్లు చనిపోయారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తంచేసింది.

# ఫామ్‌హౌస్‌ల కోసమే మూసీ ముసుగు!

గురువారం సికింద్రాబాద్ సిఖ్ విలేజ్‌లో ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్టు కార్యక్రమాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్, హరీశ్‌రావులతోపాటు సబితా ఇంద్రారెడ్డి ముగ్గురు కుమారులకు చెందిన ఫాంహౌస్‌ల అక్రమ నిర్మాణాలను కూల్చాలో వద్దో చెప్పాలని వారినే ప్రశ్నించారు. కేవీపీ రామచంద్రరావు ఫాంహౌస్‌లను కూలగొట్టాలో వద్దో కూడా సలహా ఇవ్వాలన్నారు. నాలాలు, చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూముల్లో అక్రమాలు చేసిందెవరో తేల్చుకుందాం రావాలని సవాల్ విసిరారు. నల్లచెరువు, సున్నం చెరువు, మూసీ ఒడ్డున అక్రమంగా ప్లాట్లు వేసి అమ్మింది బీఆర్ఎస్ వారు కాదా? అని సీఎం ప్రశ్నించారు. 'హైదరాబాద్‌కు తాగునీరు అందించిన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరిసరాల్లో బలిసినోళ్లు ఫాంహౌస్‌లు కట్టుకొని వారి డ్రైనేజీ తీసుకొచ్చి వాటిల్లో కలిపితే ఆ నీళ్లు నగర ప్రజలు తాగాల్నా?'అని సీఎం రేవంత్ నిలదీశారు. అక్రమాలకు పాల్పడ్డ వారిని వదలబోమని, ఒక్కొక్కడినీ చింతపండు చేస్తానని హెచ్చరించారు. నిర్వాసితులు ఇళ్లు పోయిన దుఃఖంలో ఆవేశంగా ఉంటారని.. 20 ఏళ్లపాటు ప్రజాక్షేత్రంలో తిరిగిన తనకు పేదల కష్టాలు, రాజకీయాల లోతు తెలియక కాదని సీఎం రేవంత్ పేర్కొన్నారు. అయినప్పటికీ రాబోయే తరాల భవిష్యత్ దృష్ట్యా ముందుకే వెళ్తానన్నారు. హైదరాబాద్ నగరాన్ని, రాష్ట్రాన్ని ముంచేస్తున్న మూసీ వరదలకు విపక్షాలు చేతనైతే పరిష్కారం చెప్పాలని సూచించారు. అఖిలపక్ష సమావేశాలు పెడతానని, మంచి సూచనలివ్వాలని కేటీఆర్, హరీశ్‌లను కోరారు. మూసీలో నిర్వాసితులయ్యే వారికి 15 వేల డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపుతోపాటు రూ. 25 వేల చొప్పున నగదు అందించాలని ఆదేశించినట్లు తెలిపారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌పైనా సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు. ఆయన పార్టీ మారినా పదేళ్లు బీఆర్ఎస్‌లో ఉన్నందున ఇంకా ఆ గర్దు (కంపు) పోలేదని ఎద్దేవా చేశారు. కేటీఆర్, హరీశ్ ఏం మాట్లాడితే తెల్లారే ఆ జిరాక్స్ కాపీలతో ఈటల మాట్లాడతారని ఆరోపించారు. ఆయన కూడా బతకడానికి హైదరాబాద్ వచ్చి ఎంపీ అయిన విషయాన్ని గుర్తుంచుకోవాలని.. గౌరవం నిలబెట్టుకోవాలని ఈటలకు సూచించారు. మూసీ ప్రక్షాళనకు చేతనైతే ప్రధానిని రూ. 25 వేల కోట్లు ఇవ్వాల్సిందిగా కోరదామని.. ప్రధానిని కలవడానికి తనకు భేషజాల్లేవని చెప్పారు. జవహర్‌నగర్‌లో వెయ్యి ఎకరాల భూములున్నాయని.. కేంద్రం ఆర్థిక సాయం చేస్తే మూసీ బాధితులకు ఇందిరమ్మ ఇళ్లతో కాలనీలే కడతామన్నారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సబర్మతీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేసిన మోదీని అనుసరించే బీజేపీ నేతలు.. మూసీ అభివృద్ధిని వద్దనడం ఏం న్యాయమని ప్రశ్నించారు. 'కొందరు దురాశపరుల వల్ల చెరువుల్లోని నీళ్లు రోడ్లపైకి.. అక్కడి నుంచి ఇళ్లలోకి వస్తున్నాయి. కొందరి స్వార్థంతో లక్షల కుటుంబాలు నీట మునుగుతున్నాయి. దీనికో పరిష్కారం చూపించాలి. అందరూ నాకెందుకులే అనుకుంటే నగరం మునుగుతుంది. చూస్తుండగానే చెరువులు, నాలాలు మూసుకుపోయాయి. ఇలాగే చూస్తూపోతే మూసీ కూడా మూసుకుపోతుంది'అని రేవంత్ అన్నారు. అందుకే ఇకపై ఇంకుడు గుంతల్లేకుంటే ఇళ్ల నిర్మాణాలకు అనుమతులివ్వబోమని.. ఇంకుడుగుంతల్లేని ఇళ్లకు పంపే ట్యాంకర్లకు రెండింతల చార్జీలు వసూలు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. 'నల్లగొండ జిల్లా ప్రజలు ఓవైపు ఫ్లోరైడ్‌తో, మరోవైపు మూసీ కాలుష్యంతో బతకలేని పరిస్థితిలో ఉంటే ప్రక్షాళనను అడ్డుకుంటున్న వారు ఏం ముఖం పెట్టుకొని నల్లగొండలో తిరుగుతారన్నారు. ఆ జిల్లాలో మీకు ఓట్లేయకుంటే ప్రజలను చంపేస్తారా అని బావబావమరుదులను అడుగుతున్నా'అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

వన్‌స్టేట్ వన్‌కార్డు విధానంతో ప్రభుత్వం ముందుకెళుతోందని చెప్పారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డులో ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ కూడా పొందుపరుస్తామన్నారు. తాము అధికారంలోకి రాగానే కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో కలిపేలా కేంద్రాన్ని ఒప్పించడంతోపాటు పెండింగ్‌లో ఉన్న ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టును పట్టాలెక్కించామన్నారు. కాగా, దసరాలోపే నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్రూం ఇళ్లను ఇందిరమ్మ ఇళ్ల పేరిట లబ్ధిదారులకు అందిస్తామని ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

# వైసీపీకి 11 సీట్లే ఇచ్చినా బుద్ధి రాలేదు

దెబ్బతిన్న ఆర్థిక పరిస్థితిని ఎలా నిలబెట్టాలన్నదాని గురించే ఆలోచన తప్ప రోడ్డుపైకి రావాలని ఏనాడూ అనుకోలేదు. దశాబ్దంపైగా నాపై వ్యక్తిగత విమర్శలు చేసినా, అవమానాలు చేసినా నేను పల్లెత్తు మాట మాట్లాడలేదు. కక్ష సాధింపులు ఉండవని గెలిచిన వెంటనే చెప్పాం. అయితే కలియుగ దైవానికి అపచారం జరిగితే ఎందుకు ఊరుకుంటాం" అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. అన్నీ రాజకీయాలేనా...అన్నీ ఓట్ల కోసమేనా అని ప్రశ్నించారు. వారాహి సభలో పవన్ ఇంకా ఏమన్నారంటే.. "ఇస్లాం సమాజాన్ని చూసి నేర్చుకోవాలి. అల్లా అంటే వారు ఆగిపోతారు. అదే గోవిందా అంటే మనం ఆగిపోం. మనం హైందవ ధర్మానికి గౌరవం ఇవ్వడం లేదు. నేను జేజేలు కొట్టించుకోవడానికి రాలేదు. ఎవరైతే సనాతన ధర్మాన్ని మట్టిలో కలిపేస్తామని అన్నారో వారితో గొడవ పెట్టుకోవడానికే వచ్చాను. ఉప ముఖ్యమంత్రిగానో లేక జనసేన పార్టీ అధ్యక్షుడిగానో కాదు... సగటు దేశ పౌరుడుగా జాతి మొత్తాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్నాను. సగటు భారతీయుడిగా హైందవ ధర్మాన్ని, సనాతన ధర్మాన్ని ఆరాధిస్తాను. అదే సమయంలో ఇస్లాం, క్రైస్తవం, బౌద్ధం, సిక్కు తదితర అన్యమతాలను గుండెల నిండా గౌరవిస్తాను. వసుధైక కుటుంబంగా అన్ని ప్రాణులు, జాతులు, ప్రాంతాలు సుఖంగా ఉండాలని కోరుకునే సనాతనధర్మానికి నిలువెత్తు ప్రతిరూపం శ్రీరాముడు. అనేక పేర్లతో పిలుచుకునే ఏడుకొండల వాడి ప్రసాదంలో అపచారం జరిగింది. దానికి నేను ప్రాయశ్చిత్త దీక్ష చేపడితే రాజకీయం, అపహాస్యం, అవహేళన చేస్తున్నారు. సనాతన ధర్మాన్ని పాటించడం పాపంగా మాట్లాడుతున్నారు" "సనాతన ధర్మ పరిరక్షణ కోసం రాజకీయ స్థాయిని, అధికారాన్ని, పదవులను పోగొట్టుకోవడానికి కూడా సిద్ధమే. 21 ఏళ్ల వయసులో ఇదే తిరుపతిలో సనాతన ధర్మాన్ని ఆచరించడం మొదలుపెట్టాను. ఇన్నేళ్లలో ధర్మాన్ని ఎప్పుడూ తప్పలేదు. నమాజ్ వినిపించగానే గౌరవ సూచకంగా ప్రసంగాలను నిలిపివేశాను. నిన్న నా కుమార్తె రష్యన్ క్రిస్టియన్ కావడంతో తిరుమలలో డిక్లరేషన్ ఇప్పించి నా చిత్తశుద్ధి చూపించాను. గెలుపోటములతో నిమిత్తం లేకుండా ఏ దారైతే ముందుకు తీసుకెళ్తుందో అదే నా దారి. ఏ దారైతే అపజయం కూడా అగ్నిజ్వాలై మండుతుందో అదే నా దాది. ఏ మార్గంలో మరణం కూడా మహా ప్రభంజనమవుతుందో అదే నా మార్గం. సనాతన ధర్మాన్ని కొందరు వైరస్ అంటున్నారు. అందరం కొలిచే శ్రీరాముడిని పాదరక్షలతో కొడుతూ ఊరేగింపు తీశారు. శ్రీరాముడి విగ్రహం తల నరికేశారు. జంతువుల కొవ్వు కలిపిన కల్తీ నెయ్యితో తయారుచేసిన ప్రసాదాలను శ్రీవారికి నైవేద్యంగా పంపారు. వాటినే అయోధ్య రాముడికి పంపారు. దేశ ప్రతిపక్ష నాయకుడు అయోధ్య రామాలయ ప్రారంభ వేడుకలను 'నాచ్ గానా' (తైతక్కలు) అంటూ అవహేళన చేశారు. మోదీని, నన్ను ద్వేషించండి. కానీ, రాముడ్ని ద్వేషించవద్దు. హిందువులుగా మేమెవరం నోరెత్తకూడదా? బాధపడకూడదా? ఏదైనా అంటే మాత్రం హిందూ మతతత్వవాదులైపోతాం. ఇదే విధంగా క్రైస్తవులను, ఇస్లామ్‌ను అనగలరా? అంత ధైర్యం ఉందా?"

**జగన్‌పై కేసులను సుప్రీం గమనించాలి...**

"తిరుమల ప్రసాదం కల్తీ వ్యవహారాన్ని చిన్న విషయంగా భావించకూడదు. లడ్డూ కల్తీ కేసులో సుప్రీం కోర్టు కొన్ని వ్యాఖ్యలు చేసింది. నాకు సుప్రీం కోర్టుపై, న్యాయ వ్యవస్థపై గౌరవం ఉంది. రాష్ట్రంలో గత ఐదేళ్లలో ఏమి జరిగింది? తిరుమలలో పవిత్రత ఎలా దెబ్బతినింది? అన్న విషయాలు ఆలోచించాల్సి ఉంది. లడ్డూ కల్తీకి మాజీ సీఎం జగన్ ప్రత్యక్షంగా కారణమని నేనెప్పుడూ ఆరోపించలేదు. కానీ, ఆయన పాలనలో ఏర్పాటైన టీటీడీ బోర్డు సరైన నిర్ణయాలు తీసుకోనప్పుడు దానికి జగనే బాధ్యత వహించాల్సి ఉంటుంది. సీఎం చంద్రబాబు లడ్డూ కల్తీ విషయాన్ని మీడియాతో మాట్లాడలేదు. ఎమ్మెల్యేలతో సమావేశంలో మాత్రమే మాట్లాడి వాస్తవాలు చెప్పారు. టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిక్లీన్‌చిట్ ఇచ్చుకోవడానికి ముందు బోర్డులో ఆయన తన హయాంలో ఏమి చేశారో దేశానికి చెప్పాలి. శ్రీవాణి ట్రస్టు ఏర్పాటు చేసి విరాళంగా రూ.10,500 తీసుకుని రూ.500కు మాత్రమే రశీదు ఇచ్చారు. లడ్డూ కల్తీ చిన్న వ్యవహారం కాదు. దీని వెనుక చాలా ఉంది. వేల కోట్లు స్వాహా చేసిన వ్యక్తి ఏం తెలియనట్టు నటిస్తూ సుప్రీం కోర్టుకు వెళ్లారు. టీటీడీలో అక్రమాలపై గత ఐదేళ్లుగా చెబుతునే ఉన్నాం. జాతీయ మీడియాకు ఆధారాలు ఇవ్వడానికి కూడా సిద్ధంగా ఉన్నాం. జగన్ అమాయకత్వం నటిస్తున్నారు. జగన్‌పై 29 కేసులు నమోదై ఉన్నాయి. వేల కోట్లు స్వాహా చేశారు. ఆయన పాలనలో 31 వేల మంది యువతులు అదృశ్యమయ్యారు. 290 గుడులు ధ్వంసం చేశారు.

# కలశ యాత్రలో పాల్గొన్న కౌన్సిలర్ చంద్రారెడ్డి దంపతులు





**బొల్లారం/గుమ్మడిదల,అక్టోబర్03 (డైలీ రిపోర్ట్):** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభం సందర్భంగా బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో గురువారం బీహార్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన మహిళలు భక్తిశ్రద్ధలతో కలశ యాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి దంపతులు ముఖ్యఅతిథిగా హాజరై కలశ యాత్రలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక దుర్గామాత ఆలయంలో చంద్రారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ... ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రతి ఏడాది శరన్నవరాత్రి ఉత్సవాలను మున్సిపాలిటీలో అంగరంగ వైభవంగా నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ప్రతి ఒక్కరి ఆచార సంప్రదాయాలను గౌరవించాలన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ చంద్రారెడ్డి దంపతులను స్థానిక మహిళలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జైపాల్ రెడ్డి , ఐ.ఎన్.టి.యు.సి జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మా రెడ్డి , మున్సిపల్ బీజేపీ పార్టీ అధ్యక్షులు ఆనంద్ కృష్ణ రెడ్డి , స్థానిక నాయకులు రమణయ్య , రాజ్ గోపాల్ , దిననాథ్ , జె.జె సింగ్ , రాజారామ్ , శ్రీమన్నారాయణ , చంద్రశేఖర్ గారు, శ్రవణ్ , మా అంబి మహిళా సేవాసమితి సభ్యులు దుర్గవతి , పరంశీల , ప్రమీల దేవి గారు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మెదక్ పట్టణం లోని డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే పురస్కరించుకొని ముఖ్య అతిథిగా హాజరైన నియోజకవర్గ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ ను జ్ఞాపిక తో సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది దృశ్యం.

## నిర్మల్ లో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు

### 26 బ్యాగుల క్లోరల్ హైడ్రేడ్ పట్టివేత

**నిర్మల్ బ్యూరో అక్టోబర్ 2 (డైలీ రిపోర్ట్):** నిర్మల్ లో ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ కమలాసింగ్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ హైదరాబాద్ సూపర్డెంట్ ప్రదీప్ ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. ముందస్తు సమాచారం మేరకు పట్టణంలోని ద్వారకా నగర్ కాలనీలో గాల గంధం శ్రీనివాస్ గౌడ్ ఇంట్లో దాడులు నిర్వహించగా 3.3 కిలోల అల్ప్రాజోలం ను స్వాదీనం చేసుకున్నారు. మరింత విచారించగా శాంతినగర్ కాలనీలోని ఓ ఇంట్లో 26 బస్తాలలో 728 కిలోల విలువ చేసే క్లోరల్ హైడ్రేడ్ దొరికింది. క్లోరల్ హైడ్రేడ్ ను మహారాష్ట్రలోని సోలాపూర్ శ్రీను వద్ద, అల్ఫ్రాజోలంను రాజస్థాన్ లోని రూప్ సింగ్ వద్ద కొనుగోలు చేసి దిగుమతి చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సూపర్డెంట్ ప్రదీప్ రావు మాట్లాడుతూ.. స్వాధీనం చేసుకున్న సామాగ్రి విలువ రూ.43 లక్షలు ఉంటుందని చెప్పారు.శ్రీనివాస్ గౌడ్ పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గతంలో సైతం ఇతనిపై ఏడు కేసులు, పీడీ యాక్టు కేసు ఉందని పేర్కొన్నారు. నిషేధిత మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ దాడిలో స్టేట్ ఎక్సైజ్ ఎస్సై బాలరాజు, సీఐ లక్ష్మన్ రావు, ఎస్సై వసంత రావు, అబిషేక్ ,సిబ్బంది ఉన్నారు.




## ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా జర్నలిస్టులు పనిచేయాలి

### జర్నలిస్టుల ఐక్యంగా ఉంటూ అందరికి ఆదర్శంగా నిలవాలి

### ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా కార్యాలయాన్ని ప్రారంభించిన మహేశ్వరం సీనియర్ జర్నలిస్టు ఒత్తుల రఘుపతి





మహేశ్వరం, అక్టోబర్ 03,(డైలీ రిపోర్ట్): ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా జర్నలిస్టులు పనిచేస్తూ అందరికీ ఆదర్శంగా నిలవాలని మహేశ్వరం సీనియర్ జర్నలిస్టు ఒత్తుల రఘుపతి అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యాలయాన్ని తోటి జర్నలిస్టులతో కలిసి మహేశ్వరం సీనియర్ జర్నలిస్టు ఒత్తుల రఘుపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు రఘుపతి మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రభుత్వానికి తెలియజేస్తూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా జర్నలిస్టులు పనిచేయాల్సిన అవసరం ఉందని రఘుపతి అన్నారు. జర్నలిస్టులో తమ సమస్యల కోసం ఐక్యమత్యంగా సమిష్టిగా కలిసి పని చేయాలని ఆయన అన్నారు. జర్నలిస్టుల సమస్యల కోసం కలిసి పనిచేస్తూ సమస్యను పరిష్కారం దశగా తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం సీనియర్ జర్నలిస్టులు కృష్ణ, జగన్ రెడ్డి,కే రాజ్ కుమార్, గంజి వెంకటేష్ , కబీర్, తడక నరసింహ, రాజేశ్వరి, చంద్రశేఖర్ పాల కుర్ల వెంకటేష్, నాగేష్, రాము, శేఖర్, శివ, రాజేష్, శ్రీను, బంటు వెంకటేష్, ప్రభాకర్, భాస్కర్, బీమ్ లాల్, కర్ణాకర్ , ప్రశాంత్ , తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ ఫోన్ పోతే సి ఈ ఐ ఆర్ పోర్టల్ లో ఫిర్యాదు చేయాలి

- నెల రోజుల లో 152 సెల్ఫోన్ల రికవరీ
- స్పెషల్ టీం ద్వారా సత్ఫలితాలు
- సుమారు 20 లక్షల సెల్ఫోన్ల రికవరీ
- పోలీస్ సిబ్బందిని అభినందించిన ఎస్పీ
- ఎస్పీ సింధు శర్మ వెల్లడి




**కామారెడ్డి అక్టోబర్ 3 (డైలీ రిపోర్ట్) :** సెల్ఫోన్ పోయినవారు సి ఈ ఐ ఆర్ పోర్టల్ లో ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ సింధు శర్మ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మొబైల్ రికవరీ మేళాలో పాల్గొని ఆమె మాట్లాడారు . దొంగలించబడిన , పోగొట్టుకున్న సెల్ ఫోన్ల రికవరీ కోసం గత నెల రోజులకు జిల్లాలో స్పెషల్ టీం ఏర్పాటుచేసి ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు ఇప్పటివరకు సిఇఐ పోర్టల్ ద్వారా 2020 సెల్ఫోన్లను పోర్టల్ ద్వారా గుర్తించి బాధితులకు అందజేయడం జరిగింది అన్నారు. గత నెల రోజుల క్రితం ఏర్పాటు చేసిన స్పెషల్ టీం ద్వారా 152 సెల్ఫోన్లను రికవరీ చేయడం జరిగిందన్నారు. సుమారు 20 లక్షల విలువ గల సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకొని సెల్ ఫోన్ యజమానులకు అందించడం జరిగిందన్నారు. సెల్ఫోన్ దొంగతనాల నుండి విముక్తి కల్పించడానికి సీఈఐఆర్ పోర్టల్ అందుబాటులో తీసుకురావడం జరిగింది అని తెలిపారు. ఈ పోర్టల్ ద్వారా మంచి ఫలితాలు రాబట్టడం జరుగుతుంది అని తెలిపారు. ఎవరైనా మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగలించబడిన వెంటనే నన్ను బ్లాక్ చేసి సంబంధిత పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలన్నారు. మొబైల్ రికవరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బంది రాజు శ్రీనివాస్ ఇర్ఫాన్ వినోద్ రాజకుమార్ లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పి కె నర్సింహారెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.







## గాంధీ జయంతి సందర్భంగా అనాథ ఆశ్రమంలో పుస్తకాలు, మధ్యాహ్న భోజన పంపిణీ చేసిన సరిదేనా సంతోష్ కుమార్

**హైదారాబాద్ , అక్టోబర్ 03:** ప్రతి ఏడు లాగే ...మహాత్మ ,జాతిపిత గాంధీజీ గారి 155 వ జయంతి సందర్భంగా ఘట్కేసర్ లోని ఫ్రెండ్స్ ఫౌండేషన్ అనాథ ఆశ్రమంలో సుమారు 70 మంది చిన్నారులకీ సంతోష్ వారి మిత్ర బృందం ,కటారి శ్రీనివాస్ రావు అనుచరులతో పుస్తకాలు మరియు నిత్యావసర సరుకుల పంపిణీ జరిగింది.ఇట్టి సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలను ,అహింసా మార్గంలో , జీవితంలో ముందు అడుగు ఎలా వెయ్యాలో చిన్నారులకు వివరించడం జరిగింది! ఇందుకు చిన్నారులు హర్యకేతనలు చేస్తూ నృత్యం చేసి ఆనందాన్ని వ్యక్త పరిచారు. కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన సంతోష్ కుమార్ వారి మిత్ర బృందాన్ని ఆశ్రయ సిబ్బంది ఘనంగా కొనియాడారు! ఈ కార్యక్రమంలో పవన్ కుమార్ రెడ్డి , నిషంత్ కుమార్ గౌడ్ తదతరులు పాల్గొన్నారు.

## దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో పాల్గొనాలని నీలం మధు ముదిరాజ్'కు ఆహ్వానం

### కమిటీ సభ్యులతో కలిసి ఆహ్వానం పలికిన రాష్ట్ర కార్మిక నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి



**జిన్నారం /గుమ్మడిదల ,అక్టోబర్ 3 (డైలీ రిపోర్ట్):** బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో దేవి నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకొని దుర్గామాత పూజ మహెూత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని రాష్ట్ర నాయకులు, మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ కాండేట్ నీలం మధు ముదిరాజు ని "మా అంభి మహిళా సేవా సమితి" తరఫున రాష్ట్ర కార్మిక నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉత్సవాలకు తప్పకుండా హాజరై అమ్మవారిని దర్శించుకుంటానని నీలం మధు ముదిరాజ్ గారు కమిటీ సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మా అంబి మహిళా సేవా సమితి సభ్యులు దిననాథ్ , రాజారామ్ , శ్రీమన్నారాయణ , లక్కన్ , ఉద్యానంద్ , తివారీ , శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యామిలీ డిజిటల్ సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి



**సంగారెడ్డి అర్బన్ , అక్టోబర్ 03(డైలీ రిపోర్ట్):** గ్రామంలోని ప్రతి కుటుంబాన్ని కవర్ చేస్తూ ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం కలెక్టర్ కంది, సంగారెడ్డి మండలాల్లో పర్యటించారు. ఫ్యామిలీ డిజిటల్ సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలోని ప్రతి కుటుంబం వివరాలు పకడ్బందీగా సేకరించి 5 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అక్టోబర్ 9న వివరాల స్క్రూటినీ చేసి అక్టోబర్ 10న ఫ్యామిలీ డిజిటల్ కార్డుకు సంబంధించి సమాచారంతో కూడిన నివేదిక సమర్పించాలని తెలిపారు. ఈ సర్వేలో కంది మండల తాసిల్దార్ విజయలక్ష్మి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రంగయ్య, కంది గ్రామపంచాయతీ విద్యాధర్, ఎంపీ ఓ మహేందర్ రెడ్డి , తోపుగొండ గ్రామ పంచాయతీ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

# డిజిటల్ కార్డుల సర్వేలో సమగ్రతకు ప్రాధాన్యం

## కలెక్టర్ క్రాంతి వల్లూరు





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్03 (డైలీ రిపోర్ట్):** సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని తోపుకొండ గ్రామంలో కుటుంబ సభ్యుల వివరాల సేకరణ, డిజిటల్ కార్డుల జారీ కోసం చేపట్టిన సర్వేను గురువారం జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. సర్వే ప్రక్రియను సమగ్రంగా, పొరపాట్లు లేకుండా పూర్తిచేయాలని ఆమె అధికారులకు కఠిన సూచనలు చేశారు.కలెక్టర్ క్రాంతి వల్లూరు సర్వే నిర్వహణ పద్ధతులను పరిశీలించేందుకు అధికారులతో కలసి గ్రామాన్ని సందర్శించారు. అధికారులు కుటుంబ డేటాబేస్ ఆధారంగా సర్వే చేస్తుండగా, ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. సర్వేలో ప్రతి కుటుంబానికి సంబంధించిన సమాచారాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని, ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా సవ్యంగా సేకరణ జరగాలని సూచించారు. సర్వే లో కీలక సూచనలు కలెక్టర్ అధికారులను ఉద్దేశించి, సర్వే సమయంలో ముఖ్యమైన వివరాలు సరిగ్గా పొందుపరచాలని స్పష్టం చేశారు. ఇంటి నెంబరు, చిరునామా, కుటుంబ యజమాని పేరు, కుటుంబ సభ్యులకు యజమానితో ఉన్న సంబంధం వంటి వివరాలను పూర్తిగా నమోదు చేయాలని, ఏ చిన్న లోపం కూడా ఉంటే తదనంతరంలో ఇబ్బందులు తలెత్తుతాయని హెచ్చరించారు.

అలాగే, ఎవరూ సర్వేలో భాగం కాకుండా మిగిలిపోకుండా ప్రతి ఇంటిని సందర్శించాలన్నారు.డిజిటల్ కార్డుల సర్వే పైలెట్ ప్రక్రియ నిర్ణీత సమయంలోపు పూర్తవ్వాలని, లక్ష్యంగా పెట్టుకున్న సమయానికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సర్వేలో నూటికి నూరు శాతం సమగ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఒక్క ఇంటి వివరాలు కూడా మిగిలిపోకుండా అన్ని కుటుంబాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించాలి. సర్వే ప్రక్రియలో ఒక చిన్న లోపం కూడా ఊహించని ఇబ్బందులు తీసుకురావచ్చు, అందువల్ల అన్ని అధికార యంత్రాంగం ఈ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి అని అన్నారు.సర్వే నాణ్యతకు సంబంధించిన అంశాలను పర్యవేక్షించడంలో జిల్లా యంత్రాంగం కీలక పాత్ర పోషించాలన్నారు. సర్వే ప్రక్రియ ను పర్యవేక్షించేందుకు తహసీల్దార్, ఆర్డీఓ మరియు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు.

**ప్రజలలో అవగాహన పెంపు**

డిజిటల్ కార్డుల సర్వే గురించి గ్రామస్తులకు పూర్తి అవగాహన కల్పించడం, ప్రజలు తమ వివరాలు సక్రమంగా అందజేసేందుకు ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర సేవలు మరింత సమర్థవంతంగా అందించే అవకాశం ఉందని ఆమె తెలిపారు. సర్వే పూర్తయిన తర్వాత డేటా సమగ్రతను నిర్ధారించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ విజయలక్ష్మి, ఎంపీ ఓ మహేందర్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ, అంగన్వాడి టీచర్లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# రాయికోడ్ లో నిబంధనల ఉల్లంఘనపై చర్యలు నిల్

### అహింసావాదికి హింసాత్మక అవమానం

### తప్పుడు నివేదికతో సంజాయిషీ ఇచ్చిన కార్యదర్శి

### ఉదాసీనంగా అధికార యంత్రాగం

### జిల్లా కలెక్టర్ ను సైతం తప్పుదోవ పట్టించే ప్రయత్నం

**రాయి కోడ్,అక్టోబర్03(డైలీ రిపోర్ట్):** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారి పై ఉన్న పలు మాంసం దుకాణాల్లో అహింసవాది జాతిపిత మహాత్మాగాంధీ జయంతి రోజున కూడా యథేచ్ఛగా మాంసం విక్రయాలు కొనసాగడంపై డైలీ రిపోర్ట్ వెబ్ లో గురువారం అహింసవాదికి హింసాత్మక నివాళులు అనే శీర్షిక పై సోషల్ మీడియాలో కథనంపై అధికారులు చర్యలు చేపట్టకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. గ్రామంలోని పలు దుకాణాల్లో మాంసం విక్రయాలు జరిగిన అంశంలో క్షుణ్ణంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిన పంచాయతీ కార్యదర్శి శివశంకర్ ఉన్నత అధికారులను తప్పుదోవ పట్టించేవిధంగా దుకాణాలు మూసి ఉన్నాయని లిఖితపూర్వకంగా మండల అధికారులకు సంజాయిషీ ఇచ్చాడు. అదే అదే వివరణను మండల అధికారులు ఉటంకిస్తూ జిల్లా కలెక్టర్ కు నివేదించేందుకు సిద్ధమయ్యారు. మాంసం విక్రహించిన యజమానులపై జరిమానాలు విధించాల్సిన పంచాయతీ కార్యదర్శి శివశంకర్ మాంసం విక్రయాలు జరుగలేదన్నట్లు మూసి ఉన్న




దుకాణం ఛాయాచిత్రం కాపీతో సంజాయిషీ పత్రాన్ని సమర్పించి అహింసవాది ని అవమానించేలా విధులు నిర్వహించడం కొసమెరుపు.. మరోవైపు జరిగిన సంఘటనపై బాధ్యతయూతంగా వ్యవహరించాల్సిన ఎంపీఓ అంజలీదేవి తమకేమీ తెలియదని వివరణ ఇవ్వడం గమనార్హం. గ్రామపంచాయతీ కార్యదర్శి, ఎంపిఓ నిర్లక్ష్యపు వ్యవహారశైలి పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. ఇప్పటికైనా జిల్లా అధికారులు జరిగిన సంఘటనపై విచారణ జరిపి బాధ్యతారహితంగా వ్యవహరించిన స్థానిక ఎంపీఓ కార్యదర్శిపై చర్యలు చట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది..

# సెప్టిక్ ట్యాంక్, డ్రైనేజీ వాటర్ ను ప్లాట్ లలోకి వదులుతున్న

### సత్పుర అల్ ఫైన్ అపార్ట్ మెంట్

### చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

శంకర్‌పల్లి: అక్టోబర్ 03: (డైలీ రిపోర్ట్): సత్పుర అల్ ఫైన్ అపార్ట్ మెంట్ లో నివాసం ఉంటున్న వారు సెప్టిక్ ట్యాంక్, డ్రైనేజీ వాటర్ ను పక్కనే ఉన్న ప్లాట్ లలోకి వదులుతున్నారని స్థానిక ప్రజలు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని చిన్న శంకర్‌పల్లి వైపుకు వెళ్లే దారిలో ఉన్న సత్పుర అల్ ఫైన్ అపార్ట్ మెంట్ లో ప్రజలు నివాసం ఉన్నారు. అపార్ట్ మెంట్ కు ఆనుకొని కొన్ని ప్లాట్లు ఉన్నాయి. అపార్ట్మెంట్ నుండి వచ్చే సెప్టిక్ ట్యాంక్, అండర్ డ్రైనేజీ వాటర్ పక్క ప్లాట్ లోకి వదులుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అపార్ట్మెంట్ పై తగు చర్యలు తీసుకోవాలని, సమస్యను తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.








# మంగంపేటలో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే ప్రారంభం

### సర్వే ప్రక్రియను తనిఖీ చేసిన ఆర్ అండ్ బి సెక్రెటరీ హరిచందన

**పటాన్చెరు, అక్టోబర్ 03:(డైలీ రిపోర్ట్):** పటాన్చెరు నియోజకవర్గం జిన్నారం మండలం మంగంపేట గ్రామంలో గురువారం రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్ అండ్ బి సెక్రటరీ హరిచందన సర్వేను స్వయంగా పరిశీలించారు. ప్రతి కుటుంబ వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామంలోని ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డులు ఇస్తామన్నారు. ప్రభుత్వం అందించే అన్ని పథకాలను అర్హులకు అందించేందుకు డిజిటల్ కార్డు తప్పనిసరి అని తెలిపారు. సర్వే కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈఆర్వో దేవుజా రేణుక రెడ్డి ఎంపీడీవో అరుణారెడ్డి తాసిల్దార్ బిక్షపతి ఎంపీ ఓ రాజ్ కుమార్ ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# కన్నాయపల్లి గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్

### సన్మానించిన లోనే శ్రావణ్ కుమార్

**రఘునాథపల్లి, అక్టోబర్ 3 (డైలీ రిపోర్ట్):** ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రోగ్రాంలో భాగంగా రఘునాథపల్లి మండలంలోని మాదారం, కన్నాయపల్లె గ్రామాలు పైలట్ గ్రామాలుగా ఎంపిక కావడం జరిగింది. అందులో భాగంగా కన్నాయపల్లి గ్రామంలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రోగ్రాంలో భాగంగా జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాష పర్యవేక్షించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన నాయకులు లోనే శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈసందర్భంగా తమ గ్రామం మొదటి విడతలో పైలెట్ గ్రామంగా ఎంపిక కావడం సంతోషకరమని లోనే శ్రావణ్ కుమార్ అన్నారు. కన్నాయపల్లి గ్రామంలో మొత్తం 196 కుటుంబాలు ఉన్నాయని, ఇంటింటికి వచ్చిన అధికారులకు గ్రామ ప్రజలు సహకరించి పూర్తి వివరాలు అందించి సర్వేను పూర్తి చేసుకోవాలని తెలిపారులి ఈ ప్రోగ్రాం లో కలెక్టర్ తో పాటు మండల ఎమ్మార్వో గారు మరియు ఆర్టీవో గారు మండల అధికారులు పాల్గొనడం జరిగిందిలి. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు పగిడిపాల అశోకు,మాజీ సర్పంచ్ నర్సింగ్ రావు, నలుగురి ఉపేందర్,వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు గ్రామ రైతులు,యూత్ సభ్యులు పాల్గొన్నారు..

# మోకిలలో ఉడిపి'స్ ఉపహార్ ఫ్యామిలీ రెస్టారెంట్ ను ప్రారంభించిన చేవెళ్ల, తాండూరు ఎమ్మెల్యేలు



**శంకర్‌పల్లి: అక్టోబర్ 03: (డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మండల పరిధిలోని మోకిల గ్రామ శివారులో గల సుభిషి టౌన్ సెంటర్ లో 40వ ఉడిపి'స్ ఉపహార్ ఫ్యామిలీ రెస్టారెంట్ ను గురువారం చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిలు కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రెస్టారెంట్ నిర్వాహకులు జోగినపల్లి అరుణ్, రఘులను ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా అభినందించారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ మోకిల రోజు రోజుకు అభివృద్ధి చెందుతున్నదని ఇలాంటి రెస్టారెంట్ ల అవశ్యకత ఉందన్నారు. ప్రజలు తమ దైనందిన జీవితంలో భాగంగా కుటుంబంతో కలిసి రెస్టారెంట్ కు వస్తారని, వారిని దృష్టి లో ఉంచుకుని మెరుగైన సేవలు కల్పించాలన్నారు. రెస్టారెంట్ నిర్వాహకులు జోగినపల్లి అరుణ్, రఘులు మాట్లాడుతూ.. తమ వద్ద, ఇండియన్, చైనీస్, తందూరి, అన్ని రకాల ప్యూర్ వెజ్ రుచికరమైన వంటకాలు సరసమైన ధరలకు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పిసిసి కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# శంకర్‌పల్లిలో ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

శంకర్‌పల్లి: అక్టోబర్ 03: (డైలీ రిపోర్ట్): శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి సంతోషిమాత ఆలయంలో గురువారం అమ్మవారి ప్రతిష్ట కార్యక్రమాన్ని స్థానికులు వైభవంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టింపజేసి బాలా త్రిపుర సుందరి అవతారంలో ఉన్న అమ్మవారికి పురోహితుడు రాజేశ్వర్ జోషి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వివిధ పార్టీల నాయకులు, భవాని మాలధారణ భక్తులు పాల్గొన్నారు.







# కాంగ్రెస్ ప్రభుత్వం పేదల భూములు గుంజుకుంటుంది: మాజీ మంత్రి హరీష్ రావు

**జహీరాబాద్ అర్బన్ ,అక్టోబర్ 03(డైలీ రిపోర్ట్):** న్యాల్ కల్ మండలంలోని డప్పూర్,మల్గి,వడ్డీ గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న ఫార్మాసిటీ కంపెనీ రద్దు జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని సిద్దిపేట ఎమ్మెల్యే,మాజీ మంత్రి హరీష్ రావ్ భూనిర్వాసితులకు భరోసా కల్పించారు. గురువారం న్యాల్ కల్ మండలంలోని డప్పురు గ్రామంలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన పాల్గొని భూనిర్వాసితులతో మాట్లాడి వారికి మద్దతు తెలుపుతూ సమస్యలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన పంట పొలాలను పరిశీలించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో హరీష్ రావు మాట్లాడుతూ బంగారం లాంటి మూడు పంటలు పండే భూముల్లో ఫార్మాసిటీ ఏర్పాటు చేసి మంజీరను కలుషితం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వంకు ఏమాత్రం తగదన్నారు.హైదరాబాద్ సమీపంలో ఫార్మాసిటీ ఏర్పాటు కోసం పదిహేను వేల ఎకరాలు కేటాయించగా పర్యావరణ,అటవీ అనుమతులు వచ్చినప్పటికీ న్యాల్కల్ మండలంలో ఫార్మాసిటీ ఏర్పాటు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి ఇక్కడి పచ్చటి భూముల్లో ఫార్మసిటిని ఏర్పాటు చేయాలని చూస్తున్నారని ప్రజలు దీనిని తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు.సీఎం రేవంత్ రెడ్డి పాలనంటే పిచ్చోడి చేతిలో రాయిలా ఉందని ఆయన ఎద్దేవ చేశారు.రంగారెడ్డిలో ఫార్మసిటీ ఉందా లేదా అని హైకోర్టు ప్రశ్నిస్తే ఉందని చెప్పి అక్కడ మూడు నాలుగు వేల ఎకరాలలో ఫార్మా ఏర్పాటు చేసి మిగతా భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి పన్నాగం వేశారన్నారు. ఇక్కడి భూ నిర్వాసితులకు అండగా ఉండి న్యాల్ కల్ లో ఫార్మాసిటీ రద్దు జరిగే వరకు అండగా ఉంటూ తాము పోరాటం చేస్తామని, నిర్వాసితులు కూడా ఎదురు తిరగాలని ఆయన పిలుపునిచ్చారు. మూసి సుందరి కరణ పేరుతో పేదల ఇండ్లు కూలగొడుతున్నారని ఇదేనా ఇందిరామ రాజ్యామని ఆయన ప్రశ్నించారు.ఇందిరమ్మ గరీబి హటావో అంటే సీఎం రేవంత్ రెడ్డి కిసాన్ హటావో అంటూ పాలన సాగిస్తున్నారని ఆయన విమర్శించారు. వరంగల్ డిక్లరేషన్ లో ప్రభుత్వ భూములకు పట్టాలిస్తామన్న కాంగ్రెస్ ప్రస్తుతం రైతుల నుండి గుంజుకుంటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఇంతవరకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని, రైతు భరోసా,పెన్షన్ల పెంపు, మహిళలకు రూ.2500 పథకం తదితరాలను అమలు చేయకుండా సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.జహీరాబాద్,నారాయణఖేడ్ నియోజకవర్గాలను సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో తమ ప్రభుత్వం సంగమేశ్వర, బసవేశ్వర పథకాలను మంజూరు చేస్తే సీఎం రేవంత్ రెడ్డి వాటిని నిలుపుదల చేశారన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయి అభివృద్ధి కుంటుబడిందని హరీష్ రావు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జహీరాబాద్,సంగారెడ్డి ఎమ్మెల్యేలు మాణిక్ రావ్,చింత ప్రభాకర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్,మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్,డప్పూర్ మాజీ సర్పంచ్ మారుతి, నియోజకవర్గంలోని వివిధ మండలాల బీఆర్ఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# ఉరి తీయండి లేదా ఎన్కౌంటర్ చెయ్యండి

- ప్రభుత్వ విప్ బిర్లా ఐలయ్య ,ఎంల్ సి యెగ్గే మల్లేశం
- సీఎం రేవంత్ రెడ్డి ఇలాంటి వారిని క్షమించడు
- రాష్ట్రంలో ఇలాంటి ఘటన పునరావృతం కావొద్దు
- బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది



తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 03(డైలీ రిపోర్ట్): కొమురవెల్లి మండలం గురువన్న పేటలో మైనర్ బాలిక హత్యాచారానికి గురైన కుటుంబాన్ని గురువారం కురుమ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ విరులు ఐలయ్య ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశం , తుల ఉమా రాష్ట్ర నాయకులు షెఫర్డ్ ఇంటర్నేషనల్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పుష్ప నగేష్ పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఇలయ మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పున్రుతం కాకుండా ఇలాంటి మానవ మృగానికి ప్రభుత్వం ఉరిగాని ఎన్కౌంటర్ గాని చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఇలాంటి వారిని ఉపేక్షించబోరన్నారు. చట్టపరమైన చర్యలతో పాటు బాధితులకు భరోసా కల్పించడంలో ప్రభుత్వం ముందుంటుందని హామీ ఇచ్చారు. వారి కుటుంబానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు ప్రభుత్వం తరపున చేపిస్తానని భవిష్యత్తులో ఏ లోటు రాకుండా చూస్తామన్నారు. కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యెగ్గె మల్లేశం ఎమ్మెల్సీ మాట్లాడుతూ గ్రామాల్లో నివసించే ప్రజలు కుల మతాలకతీతంగా సహాయ సహకారాలు చేసుకుంటారని ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు నిందితులపై దాడి చేయడం సహజమే అన్నారు. నిందితుడు అమాయకు బాలికపై ఇలాంటి ఘటన చేపట్టడం దారుణమని దానికి వారి కుటుంబం మద్దతు పలకడం మరింత దారుణం అన్నారు. దాడి చేయడం సంఘటనలు బయటకు తీయడం వంటి కార్యక్రమాలు చేసిన 13 మంది అమాయకులపై పోలీసులు కేసులు బనాయించడం సరికాదని కేసులను వెంటనే వాపస్ తీసుకోవాలని సిద్దిపేట కమిషనర్ డాక్టర్ అనురాధ కు చెప్పమన్నారు. కమిషనర్ సానుకూలంగా స్పందించిందని అవసరమైతే సీఎం వరకు వెళ్లి పోరాటం చేసేందుకు కురుమ సంఘం పక్షాన సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. పోలీసులు శాంతిభద్రతతో పాటు బాధితుల వైపు ఉండి పోరాటం చేసిన అమాయకులపై కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. రాష్ట్ర టిఆర్ఎస్ నాయకులు క్యామ మల్లేశం మాట్లాడుతూ గతంలో ఇలాంటి సంఘటనలు అనేకం జరిగాయని ఎక్కడో అడవిలో దూరప్రాంతాల్లో జరిగిన ఘటన చూసాము కానీ బాధితురాలు ఇంట్లోనే అత్యాచారం చేయడం హేయమైన చర్య అని ఇలాంటి వారిని ప్రభుత్వం వెంటనే ఎన్కౌంటర్ చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి యే హెూం మంత్రిగా ఉన్నాడు కాబట్టే స్పందించి త్వరగా నిర్ణయం తీసుకోవాలని బాధితులకు త్వరగా న్యాయం జరుగుతుందని నమ్మకం తనకు ఉందన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత ఇంట్లోనే లేకుంటే మరెక్కడ ఉంటుందో అర్థం కాని సంఘటనగా ఉన్నదన్నారు.ఈ కార్యక్రమంలో జనగాం జిల్లా అధ్యక్షులు కొమ్మూరు ప్రతాప్ రెడ్డి రాష్ట్ర యువజన అధ్యక్షుడు అరుణ్ కుమార్, బండారూ నారాయణ , కొండలరాజ్ , బండారు విజయ్ రాష్ట్ర నాయకులు శ్రీశైలం, వెంకటేశం, నాయకులు నరసింహ జిల్లా అధ్యక్షులు కోరే ఎల్లయ్య ఉపాధ్యక్షులు పుల్ల బీరయ్య , కురుమ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు బింగిస్వామి పులి బాలచంద్రం,సిహెచ్ లింగం. బండార్ కిష్టయ్య, కామల్ల భూమయ్య ,కామల్ల బీరప్ప, శెట్టి రాజు, కురుమ శ్రీశైలం, మాజీ సర్పంచ్ ఐలం, మాజీ సర్పంచ్ ఐలయ్య, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# మంత్రి కొండా సురేఖ కేటీఆర్ పై చేసిన వ్యాఖ్యలు అర్థరహితం

## తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలి -బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు నల్లా భూపాల్ రెడ్డి

**అనంతగిరి,అక్టోబర్3,(డైలీ రిపోర్ట్):** హైడ్రా దృష్టి మరల్చేందుకే మంత్రి కొండా సురేఖతో హీరో నాగచైతన్య,హీరోయిన్ సమంత విడిపోవడానికి కారణం కేటీఆర్ ఏ అని కాంగ్రెస్ ప్రభుత్వం అనుచిత వ్యాఖ్యలు చేయించిందని,తక్షణమే మంత్రి చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని అనంతగిరి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నల్లా భూపాల్ రెడ్డి అన్నారు.గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ....చెమటోడ్చి కష్టపడి రూపాయి రూపాయి కూడా పెట్టి ఇండ్లు కట్టుకుంటే ప్రభుత్వం కనీస కనికరం లేకుండా వేరే ప్రత్యామ్నాయ మార్గం చూపకుండా నిర్ధాక్షణంగా ఇండ్లను కండ్ల ముందే కూల్చివేయడంతో అనేకమంది నిరుపేదలు రోడ్డున పడ్డారని పేర్కొన్నారు.ప్రభుత్వ నిబంధన ప్రకారం అక్రమ కట్టడాలు అని తెలిసినప్పుడు వారికి కనీసం వేరే షెల్టర్ చూపించకుండా వారిని వీధిన పడేయడం సమంజసం కాదన్నారు.ఇదే విషయమై హైకోర్టు సైతం తీవ్రస్థాయిలో మందలించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం పై రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయిలో తీవ్ర వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కావాలని హీరోయిన్ సమంత,నాగచైతన్య పేర్లను బయటకు తీసుకువచ్చి వారి దాంపత్య జీవితం విడాకులపై అనుచిత వ్యాఖ్యలు చేయించారని ఆయన ఆరోపించారు.ఒక మంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ఈ విధంగా మరో మహిళపై వ్యాఖ్యలు చేయడం సమర్ధనియం కాదన్నారు.తక్షణమే మంత్రి సురేఖ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని మాజీమంత్రి కేటీఆర్ కు బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.





ఏడుపాయల దేవస్థానం నందు గురువారం నుండి ప్రారంభం కానున్న దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు పూజ కార్యక్రమం లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హన్మంత రావు దృశ్యం.

ఏడుపాయలు , డైలీ రిపోర్ట్

# మున్సిపల్ చైర్మన్‌గా పండుగల జయశ్రీ ఏకగ్రీవ ఎన్నిక

**పెద్ద అంబర్పేట్ , అక్టోబర్ 3 డైలీ రిపోర్ట్:** పెద్ద అంబర్పేట మున్సిపాలిటీ చైర్ పర్సన్ గా పండుగల జయశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.జిల్లా కలెక్టర్ శశాంక్ ఆదేశాల మేరకు అధికారి చేవెళ్ల ఆర్డిఓ పి.సాయిరాం ఆధ్వర్యంలో పెద్ద అంబర్ పెట్ మున్సిపాలిటీ తట్టి అన్నారం వార్డు కార్యాలయంలో జరిగిన కౌన్సిలర్ల సమావేశంలో పండుగల జయశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అనంతరం ఎన్నికల ప్రత్యేక అధికారి సమక్షంలో నూతన చైర్ పర్సన్ గా ప్రమాణ స్వీకారం చేసి పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ చామ సంపూర్ణ విజయ శేఖర్ రెడ్డి, కౌన్సిలర్ లు గ్యారల శ్రీనివాస్ గౌడ్, మోతే మణెమ్మ, వడ్డేపల్లి విద్యావతి విజేందర్ రెడ్డి, పసుల రాజేందర్, దండెం కృష్ణారెడ్డి, చల్లూరి మురళీధర్ రెడ్డి, మల్రెడ్డి దీపిక, పబ్బతి లక్ష్మణ్, మద్ది నరేందర్ రెడ్డి, రోహిణి రెడ్డి, పాశం అర్చన దామోదర్, దేవుడి గీతా వేణుగోపాల్ రెడ్డి, కోటేశ్వరరావు, రమావత్ పరశురాం, జొరక గీత, ఓరుగంటి సుజాత, చెవుల హరిశంకర్, సిద్ధాంకి కృష్ణారెడ్డి, కందాడ అనుపమ, మున్సిపల్ కమిషనర్ ఎస్ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.



Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707